నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

బోడుప్పల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా 33/11కేవీ సరస్వతినగర్ ఫీడర్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరస్వతి నగర్, విజయపురి కాలనీ, శ్రీలక్ష్మీనగర్, ఉదయ్‌నగర్, అశోక్‌నగర్, ప్రశాంత్‌నగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

దేవేందర్ ఫీడర్ పరిధిలో..

బోడుప్పల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా దేవేందర్ ఫీడర్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ వినయ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. ఉదయం 11.30 నుంచి 12.30 గంటల వరకు దేవేందర్‌నగర్, గౌతమినగర్, అంబేడ్కర్‌నగర్, రాజీవ్‌నగర్, జ్యోతినగర్, గణేష్‌నగర్, వీరారెడ్డి కాలనీ, ఇందిరానగర్, అన్నపూర్ణ కాలనీ, కమలానగర్, కాకతీయ కళానగర్, సిసిఎంబీనగర్ కాలనీల్లో సరఫరా ఉండదన్నారు.

ఎన్జీఆర్ఐ సబ్‌స్టేషన్ పరిధిలో..

ఉప్పల్: 33/11 కేవీ ఎన్జీఆర్ఐ సబ్‌స్టేషన్ పరిధిలోని హబ్సిగూడ సెక్షన్ 11 కేవీ హెచ్ఎంటీనగర్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 11 నుంచి 11.30 వరకు హెచ్ఎంటీనగర్ 5, 6, 7, ఉదయ భాను అపార్ట్‌మెంట్ ఏరియాలో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ గణేష్ తెలిపారు.

అల్వాల్: మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు తెలిపారు. ఆర్‌పి.నిలయం సబ్‌స్టేషన్ 11కేవీ వైష్ణవి మాత టెంపుల్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బాటియా బేకరీ, వెంకట్‌రావుపేట్, రాజ్‌గోపాల్‌నగర్‌లో.. 11కేవీ అల్వాల్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అల్వాల్, టెంపుల్, మున్సిపల్ కార్యాలయం ప్రాంతాల్లో.. మచ్చబొల్లారం సబ్‌స్టేషన్ 11కేవీ మధురా ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మధురా ఎన్‌క్లేవ్, శ్రీనివాసనగర్, అల్వాల్, భారతినగర్‌లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

క్రమశిక్షణకు మార్గం..ఆధ్యాత్మికత



పూజలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

మల్కాజిగిరి: ఆధ్యాత్మికత క్రమశిక్షణకు మార్గంగా నిలుస్తుందని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. ఓల్డ్ మల్కాజిగిరిలో పునర్నిర్మాణం అవుతున్న ఆంజనేయస్వామి దేవాలయంలో పనులను పరిశీలించి అనంతరం నూతనంగా ఏర్పాటు చేస్తున్న గడపలకు పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ నిర్వాహకులు ఆలయ ప్రాముఖ్యతను ఆయనకు వివరించారు. ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తానన్నారు. కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ మండల రాధాకృష్ణయాదవ్, శోభన్‌బాబు, చింతల మల్లేషయాదవ్, రంగా విజయ్‌కుమార్, ఈవో వెంకన్న, సతీష్‌కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో ఆపరేషన్ స్మైల్

ఉప్పల్: స్మైల్ ఆపరేషన్ కార్యక్రమంలో భాగంగా కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం పలు షాపుల్లో, వ్యాపార సముదాయాల్లో పనిచేస్తున్న ఆరుగురు చిన్నారులను ఉప్పల్ పోలీసులు గుర్తించి వారిని చైల్డ్ వెల్ఫేర్ అధికారులకు అప్పగించారు. బాలలను పనిలో పెట్టుకుంటే కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు.

విచారణ జరిపి రీ టెండర్ వేయాలి

కుషాయిగూడ: కుషాయిగూడ కూరగాయాల మార్కెట్ వ్యాపారులు ఏళ్ల తరబడి కోట్ల రూపాయాలు అద్దె చెల్లించడం లేదంటూ జీహెచ్ఎంసీ అధికారులు నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు స్పందించారు. రూ.కోట్లలో అద్దె చెల్లించకుండా ప్రభుత్వ ఖజానాకు గండి పడుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అద్దెతో పాటు విద్యుత్ బిల్లులు చెల్లించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. మార్కెట్‌లో షాపులు అలాట్ చేసిన వ్యాపారులు చాలామంది మార్కెట్‌లో లేరని, కొన్ని షాపులు 7-8 మంది చేతులు మారాయని, ప్రస్తుతం ఒక షాపు ధర రూ.25 నుంచి రూ.30 లక్షల వరకు బేరం నడుస్తున్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ఈ అంశాలపై కూడా జీహెచ్ఎంసీ అధికారులు సమగ్ర విచారణ చేపట్టి బీనామి వ్యాపారులను తొలగించి రీ టెండర్ వేయాలని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పనగట్ల చక్రపాణిగౌడ్ డిమాండ్ చేశారు.

నేత్రాలు, కిడ్నీలు దానం



వంశీ(ఫైల్)

మల్కాజిగిరి: ఆటో నడిపి కష్టపడి కొడుకును చదివించాడు. గొప్ప ప్రయోజకుడిగా చూడాలని ఆశించాడు. కానీ ఆ తండ్రి ఆశలు అడియాశలయ్యాయి. వివరాల్లోకి వెళ్లితే మల్కాజిగిరికి చెందిన మనోజ్ ఆటో డ్రైవర్. అతడి కొడుకు వంశీ(24) అమెజాన్‌లో పనిచేస్తున్నాడు. 23వ తేదీ తన స్నేహితుడితో కలిసి కొమురవెల్లి మల్లన్న దర్శనం కోసం వెళ్లాడు. తిరిగి వస్తుండగా ఐతారం గ్రామ శివారులో రోడ్డు ప్రమాదంలో అతడి స్నేహితుడు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రగాయాలైన వంశీని మొదట సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తర్వాత మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. బ్రెయిన్ డెడ్ కావడంతో అతడి తల్లిదండ్రులు అవయవ దానానికి ఒప్పుకోవడంతో నేత్రాలు, కిడ్నీలు సేకరించారు.

కబ్జాలు ఇంతింతగాదయా..

- బోడుప్పల్‌లో ప్రభుత్వ స్థలాలు మాయం
- రాత్రికి రాత్రే జేసీబీలతో రెచ్చిపోతున్న వైనం
- ఒక్క కేసు నమోదు చేయని అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు

బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో ప్రభుత్వ స్థలాలపై ప్రజాప్రతినిధులు, కబ్జాదారులకు మక్కువ.. వాటిని ఎప్పుడు కబ్జా చేద్దామా అని ఎదురుచూస్తుంటారు. సమయం కోసం వేచిచూస్తారు. అటు అధికారులు.. ఇటు స్థానికుల నుంచి ఎలాంటి వ్యతిరేకత రాకుండా పక్కా ప్లాన్ అమలు చేస్తుంటారు. కబ్జాలకు రాత్రి వేళలో ముహూర్తం పెట్టి తెల్లారేసరికి పని పూర్తిచేస్తుంటారు. ఇక పాలకవర్గం పదవీ కాలం త్వరలో ముగియనుండటంతో అధికారుల అండదండలతో చకచకా కబ్జాలను పూర్తి చేస్తున్నారు. రాత్రి వేళలో జేసీబీలను రంగంలోకి దించి ముళ్ల చెట్లను తొలగించి ప్రభుత్వ స్థలాలను దర్జాగా మింగేస్తున్నారు. ఏకంగా బేస్‌మెంట్స్ ఏర్పాటు చేసేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు, ఉన్నతాధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం.
– బోడుప్పల్



రాజీవ్‌నగర్ కాలనీలో చదును చేస్తున్న ప్రభుత్వ స్థలం

దేవేందర్‌నగర్ సర్వే నంబర్ 63/1లోని 300 గజాల స్థలాన్ని కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టే ప్రయత్నం చేస్తున్నారు. దాని పక్కన ఉన్న కొండను జేసీబీతో తొలగించి మరో 400 గజాల్లో నిర్మాణాలు చేపట్టే ప్రయత్నం చేస్తున్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు కబ్జాదారులు చేపడుతున్న బేస్‌మెట్స్‌ను తొలగించారు. మళ్లీ అదే స్థలంలో కొంత మంది గుడిసెలు వేశారు.

- రాజీవ్‌నగర్ కాలనీ సర్వే నంబర్ 63/1లో పెద్ద గుట్ట ఉంది. దాన్ని జేసీబీతో తొలగించి 600 గజాల స్థలాన్ని చదును చేశారు. అందులో 60 గజాల చొప్పున 10 ప్లాట్స్ చేశారు. వాటిని స్థానికులకు విక్రయించారు. కొన్ని నిర్మాణాలు చేపట్టగా, మరికొన్ని నిర్మాణాలు చేపట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.
- సర్వే నంబర్ 63/26, నుంచి 63/39లో గౌతమినగర్ కాలనీని ఏర్పాటు చేశారు. ఇది ప్రభుత్వ స్థలమని అధికారులు, ప్రైవేట్ స్థలమని ప్లాట్స్ యజమానులు చెబుతున్నారు. ఈక్రమంలో అధికారులు, ప్లాట్స్ యజమానులు కోర్టుకు వెళ్లగా ప్రస్తుతం గౌతమీనగర్‌పై స్టేటస్ కో ఉంది. ఇదే కాలనీలో బిస్కెట్ గోడౌన్ వద్ద 1,000 గజాల స్థలాన్ని కబ్జా చేసి స్థానికులకు విక్రయించారు. అందులో కొన్ని నిర్మాణాలు చేపడుతున్నారు. అలాగే అదే కాలనీలో అంబేడ్కర్ విగ్రహం వద్ద మరో నాలుగు ప్లాట్స్‌ను జేసీబీతో చదును చేశారు. ఇంత జరుగుతున్నా అటు మున్సిపల్ అధికారులు, ఇటు మండల రెవెన్యూ అధికారులు కబ్జాదారులపై ఎలాంటి కేసులు పెట్టకపోవడం గమనార్హం.

రా చెరువు కింద నాలా స్థలం కబ్జా..

బోడుప్పల్ రా చెరువు కింద ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వర్షపు నీరు పోయేందుకు 40 అడుగుల నాలా ఉంది. ఇటీవల 12 అడుగుల వెడల్పుతో నాల పనులు చేపట్టి పూర్తి చేశారు. నాలాపైన సీసీ రోడ్డు పనులు కూడా చేపట్టారు. నాలాను ఆనుకుని అంబేడ్కర్‌నగర్ కాలనీ ఉంది. కాలనీవాసులు సదరు స్థలాన్ని తమ ఇళ్లలో కలుపుకున్నారు. దీంతో భవిష్యత్‌లో వరదలు వస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు కృషి

దేవేందర్‌నగర్, అంబేడ్కర్‌నగర్, రాజీవ్‌నగర్, గౌతమీనగర్ కాలనీల్లోని ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు కృషి చేస్తున్నామని ఆర్ఐ రాకేష్ అన్నారు. కొంత మంది వ్యక్తులు కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.



శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



ఎంపీ ఈటలకు ఆహ్వానం అందజేస్తున్న ఆలయ ఈఓ రవీంద్రారెడ్డి

కుషాయిగూడ: మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ మంగాపురం శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 30వ తేదీన ప్రారంభమవుతాయి. ఈ సందర్భంగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి ఆలయ కార్యనిర్వాహణ అధికారి ఎ.బి.రవీంద్రారెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు మునుగంటి రాంప్రదీప్‌తో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా వారికి స్వామి వారి ప్రసాదం అంజేసి సత్కరించారు. కార్యక్రమంలో సమ్మని మురళీచారి, సుధాకర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో దూసుకెళ్తున్న మహిళలు

– ఉమెన్ సేఫ్టీ వింగ్ అదనపు ఎస్పీ లక్ష్మీ

రామంతాపూర్: ఆడ పిల్లలమని అధైర్య పడొద్దు.. ప్రస్తుతం సమాజంలో మగవారితో సమానంగా ముందుకు సాగుతూ ఎన్నో విజయాలు సాధిస్తున్నామని ఉమెన్స్ సేఫ్టీ వింగ్ అదనపు ఎస్పీ లక్ష్మీ అన్నారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ పోలీస్ ఉమెన్ సేఫ్టీ వింగ్ దత్తా ప్రాజెక్టుల ఆధ్వర్యంలో శుక్రవారం రామంతాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలు వీధుల్లో బ్యానర్లు, ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. బాలికల ఉజ్వల భవిష్యత్తు అనే అంశంతో నిర్వహించిన కార్యక్రమానికి పలువురు అధికారులు హాజరై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో షీ టీమ్స్ ఇన్‌స్పెక్టర్ రేణుక, దత్త ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ అనురాధ, ప్రధానోపాధ్యాయురాలు జోగులత, ఉపాధ్యాయులు సుధా మాధురి, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నిర్మాణ పనుల్లో నాణ్యత తప్పనిసరి



మల్లాపూర్: నాచారం అంబేడ్కర్‌నగర్ నుంచి కార్తికేయనగర్ వెళ్లేదారిలో రూ.74 లక్షలలో నిర్మించనున్న వంతెన నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. వంతెన నిర్మాణ పనులను అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో డీఈ బాలకృష్ణ, ఏఈ కీర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

చిన్మయి మార్గ్ ఆక్రమణలపై హైడ్రా ఆరా

గౌతంనగర్: మిర్జాలగూడలోని చిన్మయి మార్గ్ రోడ్డు ఆక్రమణలపై హైడ్రా అధికారులు శుక్రవారం రోడ్డు విస్తీర్ణాన్ని పరిశీలించి మార్క్ చేశారు. ప్రజావాణిలో భాగంగా కొందరు స్థానికులు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు రోడ్డు ఆక్రమణలపై ఫిర్యాదు చేశారని, అందులో భాగంగా శుక్రవారం హైడ్రా డీసీపీ రామిరెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఆదిత్యగౌడ్, మల్కాజిగిరి సర్కిల్ టీపీవో సంగీతతో కలిసి రోడ్డు ఆక్రమణలపై హైడ్రా అధికారులు చిన్మయిమార్గ్ రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఇళ్ల బాధితులు హైడ్రా అధికారులతో రోడ్డు మార్కింగ్‌పై అభ్యంతరం వ్యక్తం చేశారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం 60 ఫీట్ల రోడ్డుకు సెట్ బ్యాక్ నిబంధన పాటించారా అని డీసీపీ బాధితులను ప్రశ్నించగా అనుమతులు ఉన్నట్లు వారు సమాధానం ఇచ్చారు. భవనాలు నిర్మించుకునేందుకు, అనుమతులు తీసుకునే ముందు మాస్టర్ ప్లాన్ 60 ఫీట్లు రోడ్డు గురించి, ఇతర నిబంధనల గురించి ఎందుకు తెలుసుకోలేదన్నారు. ఆక్రమణలకు సంబంధించిన అన్ని వివరాలు, ఫొటోలు తీసుకోవాలని టీపీవో సంగీతను ఆదేశించారు. రోడ్డు మధ్యలో నుంచి మీటర్ పెట్టి 60 ఫీట్ల రోడ్డు ఉందా లేదా? ఎంతమేరకు ఆక్రమణలకు సంబంధించి ఆక్రమించిన ప్రాంతంలో షెట్లు, ప్రహరీ గోడలు తదితర నిర్మాణాలు ఉన్నాయో నమోదు చేసుకోవాలని టీపీవోకి సూచించారు.



చిన్మయి రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



రేషన్‌కార్డుల సర్వే పనితీరును పరిశీలిస్తున్న నెమలి అనిల్‌కుమార్

మల్లాపూర్: రేషన్‌కార్డుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని జీహెచ్ఎంసీ గ్రేటర్ సీనియర్ నేత నెమలి అనిల్‌కుమార్ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ కోసం చేపట్టిన సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ ప్రతి పేదింటి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు అందరికీ అందుతాయని, ప్రజలు ఆందోళన చెందకుండా వార్డు సభల్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అర్హులైన వారికి న్యాయం జరుగుతుందన్నారు.

నేడు బంజారాల ఆత్మీయ సమ్మేళనం

కుషాయిగూడ: చర్లపల్లి సిరిగార్డెన్స్‌లో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఆత్మీయ సమ్మేళనం శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు బంజారా నాయకుడు ఇస్లావత్ హరినాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ సబావత్ రాములు నాయక్, జాతీయ అధ్యక్షుడు శంకర్ పవార్, జిల్లా అధ్యక్షుడు ధీరవత్ శ్రీనునాయక్ హాజరవుతున్నట్లు తెలిపారు.

బోడుప్పల్‌ను అగ్రగామిగా నిలిపేందుకు కృషి

- మేయర్ తోటకూర అజయ్‌యాదవ్
- రూ.7.20 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనుల శంకుస్థాపనలో మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థను అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్నట్లు మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్‌లో రూ.7.20 కోట్లతో 5, 8, 10, 11, 12, 13, 14, 15, 17, 18 డివిజన్‌ల్లో పలు అభివృద్ధి పనులకు కమిషనర్ రామలింగంతో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పాలక సంస్థలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుధ్యం విద్యుత్ వంటి వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. 16వ డివిజన్‌లో రూ.1.43 కోట్లతో ప్రైమరీ హెల్త్ సెంటర్, 14వ డివిజన్‌లో రూ.40 లక్షలతో జంతు జనన నియంత్రణ సెంటర్‌కు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్, కార్పొరేటర్లు పోగుల నర్సింహారెడ్డి, బొమ్మక్ సుగుణ బాలయ్య, బొమ్మక్ కళ్యాణ్‌కుమార్, దానగల్ల అనిత యాదగిరి, పులకండ్ల హేమలతా జంగారెడ్డి, కుంభం కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజా బహదూర్ వెంకట రామారెడ్డి విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: రాజా బహదూర్ వెంకట రామారెడ్డి ఆశయ సాధనకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సూచించారు. మల్లాపూర్ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో మల్లాపూర్ ఎలిఫెంట్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన రాజా బహదూర్ వెంకట రామారెడ్డి విగ్రహ ఆవిష్కరణకు ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై ఆవిష్కరించారు. కార్యక్రమంలో మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు శ్రీనివాస్‌రెడ్డి, పావనీరెడ్డి, మల్లాపూర్ సంఘం అధ్యక్షుడు కాసం రాజారెడ్డి, ప్రధాన కార్యదర్శి దోమ శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి ముత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

కుషాయిగూడ: డివిజన్ సమస్యలపై చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి శుక్రవారం ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్‌కుమార్ పాటిల్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డివిజన్‌లో చేపట్టాల్సిన, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై చర్చించారు. ముఖ్యంగా డివిజన్‌లో సీసీ రోడ్లు, బాక్స్ డ్రైన్ నిర్మాణాలతో పాటు వీధి దీపాల ఏర్పాటు, పార్కుల సుందరీకరణ, శ్మశానవాటిక అభివృద్ధి పనులపై జెడ్సీతో సమీక్షించారు. అవసరమైన నిధులు మంజూరు చేసి డివిజన్ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరినట్లు కార్పొరేటర్ తెలిపారు.

అంకితభావంతో పనిచేయాలి

ఉద్యోగులు అంకితభావంతో పనిచేసినప్పుడే ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలు అవుతాయని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. చర్లపల్లిలోని బస్తీ దవాఖానాను శుక్రవారం ఆమె సందర్శించారు. ఆస్పత్రికి వచ్చే రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించి నాణ్యమైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.



జెడ్సీతో మాట్లాడుతున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

సానుకూల దృక్పథంతోనే విజయాలు

సాంకేతిక విద్య రీజినల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్



రామంతాపూర్: ప్రభుత్వ జేఎస్ పాలిటెక్నిక్ కళాశాల గ్రౌండ్‌లో జిల్లాస్థాయి పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు క్రీడోత్సవాలను రాష్ట్ర సాంకేతిక విద్య రీజినల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్, ప్రిన్సిపాల్ వినయ్ కుమార్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గెలుపు, ఓటములను సమానంగా తీసు కుంటే విజయం ఖాయం అన్నారు. ప్రతి సంవత్సరం జిల్లాస్థాయి పాలిటెక్నిక్ కళాశాలల క్రీడా పోటీలు సమర్థవంతంగా నిర్వహిస్తున్నందుకు ఆయన అధ్యాపక బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో క్రీడోత్సవాల కన్వీనర్ సాయినా, ఫిజికల్ డైరెక్టర్ ఎం.రేణుక తదితరులు పాల్గొన్నారు.

కౌండిన్య గౌడ యువజన సంఘం సంక్షేమానికి కృషిచేస్తా

మల్లాపూర్: కౌండిన్య గౌడ యువజన సంఘం సంక్షేమానికి కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఓల్డ్ మల్లాపూర్‌లో కౌండిన్య భవన్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం మల్లాపూర్-మీర్‌పేట్ కౌండిన్య గౌడ యువజన సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన కేలండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.



కౌండిన్య భవనాన్ని ప్రారంభిస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

9 ఏళ్ల బకాయిలు చెల్లించాల్సిందే..

- కుషాయిగూడ కూరగాయాల వ్యాపారులకు నోటీసులు
- 9 ఏళ్లుగా అద్దె చెల్లించకపోవడంపై జీహెచ్ఎంసీ కమిషనర్ ఆగ్రహం
- 30న జీహెచ్ఎంసీ కార్యాలయానికి రావాలంటూ నోటీసులు
- తమ సమస్యలు వివరిస్తామంటున్న వ్యాపారులు

కుషాయిగూడ: కుషాయిగూడ కూరగాయాల మార్కెట్ వ్యాపారులకు జీహెచ్ఎంసీ అధికారులు ఈ నెల 22న నోటీసులు జారీ చేశారు. 9 ఏళ్లుగా అద్దె చెల్లించకపోవడంపై జీహెచ్ఎంసీ కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ కాప్రా సర్కిల్ అధికారులను వివరణ కోరారు. వ్యాపారులు ఈ నెల 30న జీహెచ్ఎంసీ కార్యాలయంలో హాజరు కావాలంటూ నోటీసుల్లో పేర్కొన్నారు.

2010లో ప్రారంభమైన మార్కెట్

- కుషాయిగూడలో కూరగాయాల మార్కెట్ 2010 డిసెంబర్ 10న ప్రారంభమైంది. మార్కెట్ కింది ఫ్లోర్‌లో 148, ఫస్ట్ ఫ్లోర్‌లో 54 దుకాణాలతో పాటు 13 నాన్‌వెజ్ షాపులు ఉన్నాయి. కింది ఫ్లోర్‌లోని కూరగాయల షాపుల్లో పూర్తిస్థాయిలో వ్యాపారాలు చేసుకుంటున్నారు. పైఫ్లోర్‌లో 10-15 షాపుల్లో మాత్రమే పూజా స్టోర్స్ నడుస్తుండగా మిగతా షాపులన్నీ ఖాళీగానే ఉన్నాయి. 2010లో మార్కెట్‌లో షాపులు దక్కించుకున్న వ్యాపారులు రూ.కోటి పది లక్షల గుడ్‌విల్ చెల్లించి దుకాణాలను స్వాధీనం చేసుకున్నారు. కాగా జీహెచ్ఎంసీ ఎస్ఎఫ్‌టీకి రూ.25 అద్దె నిర్ణయించింది. అంత అద్దె కట్టుకోలేమని రూ.9కి తగ్గించాలని అధికారులను కోరగా రూ.22లు చెల్లించాలని అధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలో 2015 వరకు అద్దె చెల్లించలేదు.
- మార్కెట్ వ్యాపారుల సమస్యకు పరిష్కారం చూపుతానని, అప్పటి ఎమ్మెల్యే చెప్పడంతో ఒక్కో షాపు యజమాని రూ.40-50 వేల అద్దె చెల్లించారు. కానీ సమస్య పరిష్కారం కాలేదు. దీంతో వ్యాపారులు పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతూ అద్దె రేటును రూ.9లకు తగ్గించాలని విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో వ్యాపారులు 9 సంవత్సరాలు చెల్లించాల్సిన అద్దె జీహెచ్ఎంసీకి చెల్లించకపోవడంతో బకాయిలు కోట్లలోకి చేరింది.
- కొత్తగా వచ్చిన జీహెచ్ఎంసీ కమిషనర్ కుషాయిగూడ కూరగాయాల మార్కెట్ వ్యాపారుల అద్దెపై ఆరా తీశారు. కాప్రా సర్కిల్ అధికారులతో పాటుగా జోనల్ కమిషనర్‌ను కూడా వివరణ కోరారు. దీంతో జీహెచ్ఎంసీ అధికారులు తాజాగా వ్యాపారులకు నోటీసులు జారీ చేశారు. ఒక్కో వ్యాపారి సుమారు రూ.3 నుంచి రూ.5 లక్షల అద్దె చెల్లించాలంటూ నోటీసులు అందజేశారు. ఈ నెల 30న జీహెచ్ఎంసీ కార్యాలయానికి హాజరు కావాలంటూ ఆ నోటీసుల్లో పేర్కొన్నారు.

కమిషనర్‌తో విన్నవించుకుంటాం



జీహెచ్ఎంసీ అధికారులు జారీ చేసిన నోటీసులు పొంతన లేకుండా ఉన్నాయి. ఈ విషయంపై ఈ నెల 30న వ్యాపారులమంతా కలిసి జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కలుస్తాం. మా సమస్యను వివరిస్తాం. వ్యాపారాలు తగ్గిపోయి బతుకుదెరువు కూడా భారంగా మారింది. వారాంతపు సంతలతో మార్కెట్‌లో వ్యాపారాలు పూర్తిగా దివాలా తీశాయి. ఇలాంటి సమయంలో జీహెచ్ఎంసీ అధికారులు ఆలోచించి అద్దె నిర్ణయించాలని కోరుతాం.
– నందగిరి లక్ష్మీనారాయణ, మార్కెట్ మాజీ చైర్మన్